వెలవెలబోతున్న రూపాయి

ఈ వారం 24 పైసలు డౌన్ • 83.27 వద్దకు పతనం

ముంబై, డిసెంబర్ 21: ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి నేలచూపులు చూస్తున్నది. డాలర్‌తో పోల్చితే రూపీ మారకం విలువ అంతకంతకూ పడిపోతున్నది. ఈ వారం మొత్తంగా జరిగిన 4 సెషన్లలో రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 24 పైసలు దిగజారడం గమనార్హం. గురువారం 9 పైసలు కోల్పోయి 83.27 వద్ద స్థిరపడింది. అంతకుముందు బుధవారం ట్రేడింగ్‌లో ఎక్కడిదక్కడే ఉన్న రూపాయి మారకం విలువ.. మంగళవారం 8 పైసలు, సోమవారం 7 పైసలు చొప్పున నష్టపోయింది. దీంతో క్షీణత స్థాయి 24 పైసలకు చేరింది.

ఆందోళనకరంగా..

ఎర్ర సముద్ర మార్గంలో సాగుతున్న అంతర్జాతీయ వర్తక, వాణిజ్య కార్యకలాపాలకు అంతరాయం కలుగడంతో మదుపర్ల సెంటిమెంట్ ఒక్కసారిగా బలహీనపడిందని ఫారెక్స్ మార్కెట్ నిపుణులు ట్రేడింగ్ సరళిని విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశీయ మార్కెట్ నుంచి విదేశీ మదుపరులు పెట్టుబడులు ఉపసంహరించుకుంటుండటం.. రూపీ విలువను అంతకంతకూ పతనం దిశగా నడిపిస్తున్నదని వారు పేర్కొంటున్నారు. స్టాక్ ఎక్స్ఛేంజీల వివరాల ప్రకారం బుధవారం విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) భారతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.1,322.08 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. నిజానికి దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. అయినప్పటికీ ఆ ప్రభావం ఫారెక్స్ మార్కెట్‌పై పడకపోవడానికి ఈ రకమైన గ్లోబల్ అనిశ్చిత పరిస్థితులే కారణమని చెప్తున్నారు. మరోవైపు అంతర్జాతీయంగా ముడి చమురు ధరల్లో ఒడిదొడుకులు కూడా దెబ్బతీస్తున్నట్టు అభిప్రాయపడుతున్నారు.

ఇలాగే సాగితే..

ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయికి ప్రతికూల పరిస్థితులు ఇలాగే సాగితే దేశ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందికరమేనన్న అభిప్రాయాలు గట్టిగా వినిపిస్తున్నాయిప్పుడు. ఇప్పటికే దేశంలో ద్రవ్యోల్బణం విజృంభిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రూపాయి పతనం.. దేశీయ దిగుమతుల్ని మరింత భారం చేస్తుం ది. ముఖ్యంగా దేశీయ ఇంధన అవసరాల్లో 80 శాతం విదేశీ చమురు దిగుమతుల ద్వారానే తీరుతున్న సంగతి విదితమే. దీంతో రూపీ నష్టాలు.. పెట్రో ఉత్పత్తుల రేట్లను ఎగదోసేలా తయారవుతున్నాయి. ఇదే జరిగితే ద్రవ్యోల్బణం ఇంకా పెరిగి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను పెంచేస్తాయని, గృహ, వాహన తదితర రుణాలు ప్రియమై ఆయా రంగాల్లో వ్యాపారాలు పడిపోతాయని అంటున్నారు. కాబట్టి రూపా యి విలువ పట్ల అటు కేంద్రం, ఇటు ఆర్బీఐ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

జేఎస్‌పీఎల్‌తో ఆర్ఐఎన్ఎల్ దోస్తీ

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ప్రభుత్వ రంగ సంస్థ రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్ లేదా వైజాగ్ స్టీల్).. జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ (జేఎస్‌పీఎల్)తో జట్టు కట్టింది. వర్కింగ్ క్యాపిటల్ మద్దతు, ముడి సరకు సరఫరాకు సంబంధించి ఇరు సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ మేరకు వివిధ ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో జరిపిన సమావేశంలో ఆర్ఐఎన్ఎల్ సీఎండీ అతుల్ భట్ తాజాగా ప్రకటించారు. నిలిచిపోయిన మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునరుద్ధరణకు తమ ఈ ఒప్పందం దోహదపడగలదని వివరించారు. కాగా, 2021 జనవరిలో ఈ బ్లాస్ట్ ఫర్నేస్ మూతబడింది. తాజా అగ్రిమెంట్ నేపథ్యంలో ఈ నెల 30న దీన్ని తిరిగి ప్రారంభించాలని సంస్థ చూస్తున్నది. దీని హాట్ మెటల్ సామర్థ్యం నెలకు 2 లక్షల టన్నులని భట్ చెప్పారు. ఇక ఈ ఒప్పందం కింద అడ్వాన్స్ వర్కింగ్ క్యాపిటల్ రూపంలో లేదా మూడో బ్లాస్ట్ ఫర్నేస్ పునరుద్ధరణకు అవసరమైన ముడి సరకు కోసం రూ.800-900 కోట్లను ఆర్ఐఎన్ఎల్‌కు జేఎస్‌పీఎల్ అందించనున్నది. దీనికి బదులుగా ప్రతినెలా జేఎస్‌పీఎల్‌కు సుమారు 90వేల టన్నుల కాస్ట్ బ్లూమ్స్‌ను ఆర్ఐఎన్ఎల్ సరఫరా చేయనున్నది. ఒప్పందంతో సంస్థ నెలవారీ సేల్స్ టర్నోవర్ సుమారు రూ.500 కోట్లు పెరుగుతుందని, ఇది కంపెనీ నష్టాలను నెలకు రూ.50-100 కోట్లను తగ్గించగలదన్న ఆశాభావాన్ని ఈ సందర్భంగా భట్ వెలిబుచ్చారు.

కోలుకున్న స్టాక్ మార్కెట్లు

359 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్

ముంబై, డిసెంబర్ 21: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతో గురువారం సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలకు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలకు దన్నుగా నిలిచాయి. ప్రారంభంలో 600 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీకి సెన్సెక్స్ చివరి గంటలో మదుపరులు కొనుగోళ్లకు మద్దతు తెలిపారు. దీంతో సెన్సెక్స్ 358.79 పాయింట్లు అందుకొని 70,865.10 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 70 వేల దిగువకు పడిపోయింది. 21,288 నుంచి 20,976 పాయింట్ల శ్రేణిలో కదలాడిన నిఫ్టీ చివరకు 104.90 పాయింట్లు పెరిగి 21,255.05 వద్ద స్థిరపడింది.

- ఎనర్జీ, మెటల్, బ్యాంకింగ్ రంగ సూచీలు తిరిగి కోలుకున్నాయి.
- అలాగే పవర్ గ్రిడ్ 2.27 శాతం పెరిగి టాప్ గెయినర్‌గా నిలిచింది. అలాగే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.82 శాతం, కొటక్ బ్యాంక్ 1.66 శాతం, రిలయన్స్ 1.38 శాతం, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, టాటా స్టీల్, ఇండస్ఇండ్ బ్యాంక్, అల్ట్రాటెక్ సిమెంట్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- వీటితోపాటు విప్రో, టాటా మోటర్స్, టీసీఎస్, టెక్ మహీంద్రా, ఎల్అండ్‌టీ, ఐటీసీ, నెస్లె, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది.
- కానీ, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఏషియన్ పెయింట్స్‌లు నష్టపోయాయి.
- బీఎస్ఈ స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ ఇండెక్స్‌లు ఒక్క శాతానికి పైగా లాభపడ్డాయి.
- రంగాలవారీగా చూస్తే యుటిలిటీ 2.46 శాతం, పవర్ 2.43 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 1.72 శాతం, టెలికం 1.64 శాతం, ఎనర్జీ 1.62 శాతం చొప్పున బలపడ్డాయి. ఆటో రంగ సూచీ మాత్రం నష్టపోయింది.

రికార్డుస్థాయికి ఎఫ్‌పీఐల షేర్ల విలువ

700 బిలియన్ డాలర్ల మార్క్‌ను మించిన ఆస్తులు

ముంబై, డిసెంబర్ 21: భారత్ స్టాక్ మార్కెట్లో పెట్టుబడి చేస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల (ఎఫ్‌పీఐలు) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులు (ఏయూఎం) రికార్డుస్థాయికి చేరుకున్నాయి. డిసెంబర్ ప్రథమార్ధంలో ఎఫ్‌పీఐల ఈక్విటీ పోర్ట్‌ఫోలియో తొలిసారిగా 700 బిలియన్ డాలర్ల మార్క్‌ను దాటి 723 బిలియన్ డాలర్లకు (రూ.60.19 లక్షల కోట్లు) చేరుకుంది. 2021 నవంబర్‌లో ఎఫ్‌పీఐల 686 బిలియన్ డాలర్ల ఏయూఎం రికార్డును తాజాగా అధిగమించడం గమనార్హం. డిసెంబర్ తొలి రెండు వారాల్లో విదేశీ ఇన్వెస్టర్లు 5.2 బిలియన్ డాలర్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు. 15 రోజుల్లో ఎఫ్‌పీఐలు ఇంత భారీగా కొనుగోళ్లు చేయడం పదేండ్లలో ఇదే తొలిసారి.

విలువ పెరిగింది.. వాటా తగ్గింది

గత రెండేండ్లలో ఎఫ్‌పీఐల ఆస్తుల విలువ పెరిగినప్పటికీ, భారత్ మొత్తం మార్కెట్ విలువలో ఎఫ్‌పీఐల వాటా మాత్రం తగ్గింది. 2021 నవంబర్‌లో 686 బిలియన్ డాలర్ల ఏయూఎం ఉన్న సమయంలో మొత్తం మార్కెట్ విలువలో ఎఫ్‌పీఐల వాటా 29 శాతంకాగా, ఇప్పుడది 17.6 శాతానికి దిగింది. 2023లో దేశీయ మార్కెట్లోకి విదేశీ ఇన్వెస్టర్లు 20.2 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశారు. ఈ మొత్తం నాలుగేండ్ల గరిష్ఠం. ఒక ఏడాదిలో ఎఫ్‌పీఐలు భారత మార్కెట్లో 20 బిలియన్ డాలర్లను మించి నిధులు కుమ్మరించడం ఇది నాలుగోసారి. ప్రస్తుత ఏడాది భారత్ ఇతర వర్ధమాన దేశాల మార్కెట్లన్నింటికంటే ఎఫ్‌పీఐల నిధుల్ని ఆకర్షించింది. 2023లో ప్రధాన వర్ధమాన మార్కెట్లయిన బ్రెజిల్, దక్షిణ కొరియా, చైనాల్లోకి 8 బిలియన్ డాలర్లు, 8.1 బిలియన్ డాలర్లు, 6.7 బిలియన్ డాలర్ల ఎఫ్‌పీఐ నిధులు వచ్చాయని బ్లూంబర్గ్ వెల్లడిస్తున్నది.

ఈ రంగాలపై మక్కువ

ప్రస్తుత ఏడాది ఎఫ్‌పీఐల నిధుల్లో మూడవ వంతు ఫైనాన్షియల్ రంగ షేర్లలోకి తరలివచ్చాయి. తదుపరి 28 శాతం క్యాపిటల్ గూడ్స్, 20 శాతం ఆటోమొబైల్ షేర్లలో పెట్టుబడి చేశారు. ఇదే సమయంలో ఆయిల్ అండ్ గ్యాస్, మెటల్స్, ఐటీ తదితర రంగాల్లో విక్రయాలు జరిపారు. ఇక ఎఫ్‌పీఐల ఏయూఎం ఏడాది కాలంలో 24 శాతం వృద్ధిచెందగా, అందులో కన్‌స్ట్రక్షన్, కన్‌స్ట్రక్షన్ మెటీరియల్, క్యాపిటల్ గూడ్స్, రియల్టీ షేర్ల విలువ అత్యధికంగా 73 శాతం పెరిగింది. ఎఫ్‌పీఐల పోర్ట్‌ఫోలియోలో ఇన్‌ఫ్రా స్టాక్స్ వెయిటేజి రికార్డుస్థాయి 10.3 శాతానికి చేరింది. ఫైనాన్షియల్ సర్వీసులు, ఆటోమొబైల్స్, ఎఫ్ఎంసీజీ రంగాల వెయిటేజి సైతం రికార్డుస్థాయికి చేరింది.

ఐపీవోలు..బంపర్ సక్సెస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఇది ఐపీవోల కాలం. ఒకవైపు స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్నప్పటికీ..మరోవైపు లిస్ట్ కావాలని చూస్తున్న సంస్థలు రోజు రోజుకి పెరుగుతున్నాయి. ఈ వారంలో అరడజన్‌కు పైగా సంస్థలు ఐపీవోకి రాబోతున్నాయి. వీటిలో మూడు సంస్థల వాటా విక్రయానికి అపూర్వ స్పందన లభించింది. సంస్థలు జారీ చేసిన షేర్ల కంటే ఎన్నో రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి. వీటి వివరాలు..

క్రెడో బ్రాండ్స్ మార్కెటింగ్

- సంస్థ జారీ చేసిన షేర్ల కంటే 51.85 రెట్ల అధిక బిడ్డింగ్‌లు దాఖలయ్యాయి.
- ఇనిస్టిట్యూషనల్ పెట్టుబడిదారులు అధికంగా కొనుగోళ్లు జరిపారు
- రూ.549.77 కోట్ల నిధుల సేకరణ కోసం 1,37,44,472 షేర్లను జారీ చేయగా 71,26,92,325 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి.
- ప్రమోటర్లు, ఇతర వాటాదారులకు చెందిన 1.96 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నది.
- షేరు ధరల శ్రేణి రూ.266-280 స్థాయిలో నిర్ణయించింది.
- సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 1,807 టచ్ పాయింట్లు ఉన్నాయి. వీటిలో 404 ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ అవుట్‌లెట్లు కాగా 71 అతిపెద్ద స్టోర్లు, 1,332 మల్టీ-బ్రాండ్ అవుట్‌లెట్లు ఉన్నాయి.
- కంపెనీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్ట్ కానున్నాయి.

ఆర్బీజెడ్ జ్యూవెల్లర్స్

- జారీ చేసిన 79 లక్షల షేర్లకు 13,31,88,450 షేర్ల బిడ్డింగ్‌లు వచ్చాయి. జారీ చేసిన దాని కంటే 16.86 రెట్లు అధికంగా వచ్చాయి.
- రిటైల్ ఇండివీడ్యువల్ ఇన్వెస్టర్లకు కేటాయించిన షేర్ల కంటే 24.74 రెట్ల అధికంగా బిడ్లు దాఖలయ్యాయి. అలాగే క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్లకు 13.43 రెట్లు, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల 9.27 రెట్లు అధికంగా వచ్చాయి.
- రూ.95-100 ధరల శ్రేణిలో కోటి ఈక్విటీ షేర్లను జారీ చేసింది.
- కంపెనీ ఈక్విటీ షేర్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో లిస్టుకానున్నాయి.

హ్యాప్పీ ఫోర్జింగ్స్

- ఆటో విడిభాగాల తయారీ సంస్థ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది.
- రూ.1,008 కోట్ల నిధులు సేకరణకు సంబంధించి 83,65,639 షేర్లను జారీచేసింది.
- ఇనిస్టిట్యూషనల్ బయ్యర్ల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో 68,62,98,398 షేర్లకు బిడ్డింగ్‌లు వచ్చాయి. అంటే 82.04 రెట్లు అధికంగా బిడ్డింగ్‌లు వచ్చాయి.
- షేరు ధరల శ్రేణి రూ.808-850 స్థాయిలో నిర్ణయించింది.
- ఆటో విడిభాగాల సంస్థ హ్యాప్పీ ఫోర్జింగ్..బ్రెజిల్, ఇటలీ, జపాన్, స్పెయిన్, స్వీడన్, థాయిలాండ్, టర్కీ, బ్రిటన్, అమెరికా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

నాట్కో ఫార్మాకు ఊరట

- **క్యాన్సర్ డ్రగ్‌పై యూఎస్‌లో దావా ఉపసంహరణ**

ముంబై, డిసెంబర్ 21: నాట్కో ఫార్మా జెనెరిక్ క్యాన్సర్ ట్రీట్‌మెంట్ డ్రగ్‌పై యూఎస్‌లో దాఖలు చేసిన యాంటీ-ట్రస్ట్ దావాను అక్కడి సంస్థ ఉపసంహరించుకుంది. క్యాన్సర్ చికిత్సా ఔషధం పొమాలిడొమైడ్‌కు సంబంధించి నాట్కో ఫార్మా, బ్రెకెన్‌రిడ్, బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్, సెల్‌జీన్ తదితర కంపెనీలపై లూసియానా హెల్త్ సర్వీస్ అండ్ ఇండిమ్నిటీ కంపెనీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో యాంటి ట్రస్ట్ కేసు వేసింది. యూఎస్‌లో పొమాలిడొమైడ్ క్యాప్సుల్స్‌కు బ్రెకెన్‌రిడ్జ్ అండా హోల్డర్ అని, తమ మార్కెటింగ్ పార్టనర్ అని, ఈ నేపథ్యంలో ఈ కేసు నుంచి తమ రెండు కంపెనీలను దావా వేసిన సంస్థ స్వచ్ఛందంగా తొలగించిందని గురువారం నాట్కో ఫార్మా స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది., నాట్కో ఉత్పత్తిచేసిన పొమాలిడొమైడ్ క్యాప్సుల్స్‌ను యూఎస్‌లో ఇంకా విడుదల చేయలేదు.

రూ.11,617 కోట్ల ఎన్‌పీఏలు

ఈ జనవరి-నవంబర్ మధ్య పీఎస్‌బీల నుంచి ఎన్ఏఆర్సీఎల్‌కు బదిలీ అయ్యాయన్న కేంద్రం



న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఈ ఏడాది జనవరి-నవంబర్ మధ్య 10 ప్రభుత్వ రంగ బ్యాంకులు రూ.11,617 కోట్లకుపైగా మొండి బకాయి (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)లను నేషనల్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్ఏఆర్సీఎల్)కు బదిలీ చేశాయని రాజ్యసభలో ఓ ప్రశ్నకుగాను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి భగవత్ కరద్ లిఖితపూర్వక సమాధానంగా తెలిపారు. ఈ ప్రభుత్వ బ్యాంకుల్లో ఎస్బీఐ, పీఎన్‌బీ, కెనరా, యూబీఐ, బీవోబీ, బీవోఐ, బీవోఎం, ఐవోబీ, సెంట్రల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లున్నాయి. ఎన్ఏఆర్సీఎల్‌కు ఎస్బీఐ నుంచి అత్యధికంగా రూ.4,508 కోట్ల ఎన్‌పీఏలు వెళ్లాయి. ఆ తర్వాత పీఎన్‌బీ (రూ.2,138 కోట్లు), కెనరా (రూ.1,858 కోట్లు), యూబీఐ (రూ.1,831 కోట్లు) బ్యాంకులున్నాయి. కాగా, ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇచ్చిన వివరాల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబర్ ఆఖరు నాటికి ఈ 10 ప్రభుత్వ బ్యాంకుల స్థూల ఎన్‌పీఏలు రూ.3.65 లక్షల కోట్లపైనే ఉన్నాయి. ఇదిలావుంటే నవంబర్ 30కల్లా ఎన్ఏఆర్సీఎల్ రూ.16.64 కోట్లను రికవరీ చేయగలిగిందంటూ మంత్రి ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. ఎన్ఏఆర్సీఎల్ అనేది ఓ బ్యాడ్ బ్యాంక్. బ్యాంకులు ఇతరత్రా రుణదాతల నుంచి మొండి బకాయిలను ఇది కొంటుందన్న విషయం తెలిసిందే.

4వేల కిలోల బంగారం సీజ్

ఈ ఏడాది జనవరి-అక్టోబర్ మధ్య రికార్డుస్థాయిలో 3,917.52 కిలోల స్మగ్లింగ్ బంగారాన్ని సీజ్ చేసినట్టు రాజ్యసభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. మొత్తం 4,798 కేసులు నమోదైనట్టు చెప్పారు. గత ఏడాది 3,982 స్మగ్లింగ్ కేసుల్లో 3,502.16 కిలోల పసిడిని జప్తు చేసినట్టు వివరించారు. ఇక 2021లో 2,445 కేసుల్లో 2,383 కిలోలు, 2020లో 2,567 కేసుల్లో 2,155 కిలోల స్మగ్లింగ్ పుత్తడిని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు.

అపార్ట్‌మెంట్లకు గిరాకీ

హైదరాబాద్‌సహా దేశంలోని 7 నగరాల్లో

ఈ ఏడాది 20 శాతం అమ్మకాలు పెరగొచ్చన్న అంచనాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: ఈ ఏడాది దేశంలోని ప్రధాన నగరాల్లో అపార్ట్‌మెంట్లకు గిరాకీ బాగా ఉందని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. హైదరాబాద్‌సహా ఏడు ప్రధాన నగరాల రియల్టీపై గురువారం స్పందించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్సీఆర్, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, పుణె నగరాల్లో గత ఏడాది 2,15,621 యూనిట్ల విక్రయాలు జరిగాయని జేఎల్ఎల్ వివరించింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అంతకంటే 20 శాతం పెరుగుతాయని, సుమారు 2.6 లక్షల యూనిట్ల అమ్మకాలకు వీలుందని అంచనా వేసింది. ఇదే జరిగితే 2008 నుంచి ఇది అత్యధికమని స్పష్టం చేసింది. ఈ ఏడాది తొలి 9 నెలల్లో (జనవరి-సెప్టెంబర్) 1,96,227 యూనిట్ల సేల్స్ నమోదయ్యాయని జేఎల్ఎల్ వెల్లడించింది. నిరుడు ఇదే సమయంలో అమ్మకాలు 1,61,575 యూనిట్లకే పరిమితమయ్యాయని పేర్కొన్నది.

వచ్చే ఏడాది 3 లక్షలకు..

వచ్చే ఏడాది ఈ 7 దేశీయ ప్రధాన నగరాల్లో అపార్ట్‌మెంట్ విక్రయాలు దాదాపు 2.9 లక్షల నుంచి 3 లక్షల యూనిట్లుగా ఉండే వీలుందని ఈ సందర్భంగా జేఎల్ఎల్ అభిప్రాయపడింది. నాణ్యమైన ప్రాజెక్టులు, మార్కెట్‌లో డిమాండ్ దృష్ట్యా 2024లో రెసిడెన్షియల్ సేల్స్ ఆకర్షణీయంగా నమోదవుతాయన్న అంచనాను వ్యక్తం చేసింది. ఇండిపెండెంట్ హౌజ్‌లు, విల్లాలు, ప్లాటెడ్ డెవలప్‌మెంట్లనూ కలిపితే ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుందన్నది. హోమ్ లోన్ల వడ్డీరేట్లు పెరిగినా, అంతర్జాతీయ స్థాయిలో మందగమనం ఛాయలు కనిపించినా.. దేశీయ రియల్ ఎస్టేట్ ఇండస్ట్రీ ఈ ఏడాది స్థితిస్థాపకతను ప్రదర్శించినట్టు రియల్టీ సంస్థ బీసీడీ గ్రూప్ ఎండీ అంగద్ బేడీ విశ్లేషించారు.

> గృహ రుణాలపై వడ్డీరేట్లు ఎక్కువగా ఉన్నా, ఇండ్ల ధరలు పెరుగుతూ పోతున్నా.. దేశీయ హౌజింగ్ మార్కెట్‌లో డిమాండ్ మాత్రం తగ్గడం లేదు. అంతా ఇండ్లను కొనేందుకే మొగ్గుచూపుతున్నారు. ఈ ఏడాది రెసిడెన్షియల్ సేల్స్ 2.6 లక్షల యూనిట్లుగా ఉండొచ్చు. కొత్త యూనిట్ల ప్రారంభాలు 2.8 లక్షలను తాకవచ్చు.
>
> -శమంతక్ దాస్, జేఎల్ఎల్ ఇండియా రిసెర్చ్ అధిపతి

> దేశంలోని ప్రధాన నగరాల్లో నిర్మాణ రంగం ఆకర్షణీయ వృద్ధిని కనబరుస్తున్నది. నివాస గృహాలకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నది. మధ్య, ఎగువ శ్రేణి ఇండ్లకు గిరాకీ బాగా ఉండగా, లగ్జరీ యూనిట్లకూ ఆదరణ పెరుగుతుండటం నిజంగా ఆహ్వానించదగ్గ పరిణామం. మున్ముందూ ఇదే రకమైన డిమాండ్‌ను అంచనా వేస్తున్నాం.
>
> -ప్రదీప్ అగర్వాల్, సిగ్నేచర్ గ్లోబల్ చైర్మన్

> గతకొద్ది సంవత్సరాలుగా భారతీయ రియల్ ఎస్టేట్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్నది. ఇందుకు తగ్గట్టే రెగ్యులేటరీ మార్పులూ వస్తున్నాయి. మరోవైపు ఇటు సప్లయర్స్, అటు కన్స్యూమర్స్ ఆలోచనా ధోరణిలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తున్నది. ముఖ్యంగా కస్టమర్ల అభిరుచికి డెవలపర్లు పెద్దపీట వేస్తూ ముందుకెళ్తున్నారు.
>
> -అఖిల్ సరఫ్, రెలాయ్ వ్యవస్థాపకుడు

నియంత్రణలతో ఎగుమతులకు దెబ్బ

న్యూఢిల్లీ, డిసెంబర్ 21: కొన్ని కీలక వ్యవసాయోత్పత్తుల ఎగుమతులపై నియంత్రణలు విధించిన ఫలితంగా ఈ ఆర్థిక సంవత్సరం 4.5-5 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు తగ్గుతాయని కేంద్ర వాణిజ్యశాఖ అదనపు కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ చెప్పారు. గోధుమ, నాన్-బాస్మతి బియ్యం ఎగుమతులను నిషేధించిన కేంద్ర ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై పరిమితులు విధించింది. అయితే ఈ చర్యలతో తగ్గే ఎగుమతుల విలువ ఇతర ఉత్పత్తుల ఎగుమతులతో భర్తీ అవుతుందని అగర్వాల్ గురువారం మీడియాకు తెలిపారు. మొత్తంమీద ఈ ఆర్థిక సంవత్సరం గత ఏడాదిలానే వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 53 బిలియన్ డాలర్లకు చేరతాయన్నారు. అరటి, మిల్లెట్ ఉత్పత్తులు తదితరాలను కొత్త అంతర్జాతీయ కేంద్రాలకు ఎగుమతుల్ని ప్రారంభించామని, వచ్చే మూడేళ్లలో అరటిపండ్ల ఎగుమతులు 1 బిలియన్ డాలర్లకు చేరతాయని అంచనా వేస్తున్నామన్నారు. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, మాంసం, డెయిరీ, పౌల్ట్రీ ఎగుమతులు ఈ ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో వృద్ధిచెందాయని, బియ్యం ఎగుమతులు మాత్రం 7.65 శాతం క్షీణించి, 6.5 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని వివరించారు.

ఇండిగోకు డీజీసీఏ షాక్

ముంబై, డిసెంబర్ 21: ఇండిగోకు డీజీసీఏ గట్టి షాకిచ్చింది. పౌర విమానయాన భద్రత నిబంధనలు పాటించకపోవడంతో రూ.20 లక్షల జరిమానా విధించింది. ఏ321 ఎయిర్‌క్రాఫ్ట్ వెనుక భాగం రన్‌వేకు తాకుతుండటంతో (టెయిల్ స్ట్రయిక్) కలిగే ప్రమాదాలను నియంత్రించడంలో సంస్థ విఫలమవుతున్నదని డీజీసీఏ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది.

దేశీయ మార్కెట్లోకి కొత్తగా విడుదలైన ఐషర్ ప్రో 8035ఎక్స్ఎం ట్రక్కుతో కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గగన్‌దీప్ సింగ్

53% ఆదరణ మిల్లీనియల్స్‌దే..

- గృహ రుణాలకు భారీ డిమాండ్
- జెన్-జెడ్ నుంచి కూడా..
- మ్యాజిక్‌బ్రిక్స్ నివేదికలో వెల్లడి



న్యూఢిల్లీ, డిసెంబర్ 21: దేశవ్యాప్తంగా మొత్తం గృహ రుణాల్లో మిల్లీనియల్స్, జెన్-జెడ్ గ్రూప్ (18-34 ఏండ్లవారు) వాటా 53 శాతంగా ఉన్నట్టు తాజాగా విడుదల చేసిన ఓ నివేదికలో ప్రముఖ రియల్టీ పోర్టల్ మ్యాజిక్‌బ్రిక్స్ వెల్లడించింది. అయితే వీరిలో 74 శాతం పురుషులు, 26 శాతం మహిళలున్నట్టు చెప్పింది. ఇక గృహ రుణాల్లో 58 శాతం రూ.40 లక్షలదాకా ఉన్న లోన్లే ఉన్నాయి. గురుగ్రామ్ రుణగ్రహీతల్లో 25 శాతం మంది రూ.40-60 లక్షల శ్రేణి లోన్లు తీసుకున్నారు. హోమ్ లోన్లలో కోటి రూపాయలు, కోటిన్నర లోన్ల వాటా 13 శాతంగా ఉన్నది. కాగా, మొత్తం గృహ రుణాల్లో 80 శాతం ప్రథమ శ్రేణి నగరాలవే. ఇందులో 22 శాతంతో ముంబై ముందున్నది. బెంగళూరు (19 శాతం), నోయిడా (17 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

స్థిరమైన వడ్డీరేట్లు

గత కొంతకాలంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచుతుండటంతో.. బ్యాంకులు సైతం గృహ రుణాలపై వడ్డీరేట్ల జోలికి వెళ్లడం లేదు. ఈ రకమైన స్థిరత్వాన్ని చూసే మిల్లీనియల్స్, జెన్-జెడ్ గ్రూప్ వయస్కులు ఇండ్ల కొనుగోళ్లకు ముందుకొస్తున్నారని మ్యాజిక్‌బ్రిక్స్ తెలిపింది. అలాగే రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు సైతం ఆకర్షణీయంగా మారడం కలిసొచ్చిందని అభిప్రాయపడింది. దీంతో రాబోయే రోజుల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగవచ్చని మ్యాజిక్‌బ్రిక్స్ వ్యాపారాధిపతి (హోమ్ లోన్స్) నిమేశ్ భండారీ అన్నారు.

ఆ మూడు నగరాలదే హవా

ప్రాపర్టీలను కొనేవారు అన్వేషిస్తున్న దేశీయ నగరాల్లో ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు, ఢిల్లీ-ఎన్సీఆర్ ముందు వరుసలో ఉన్నట్టు మ్యాజిక్‌బ్రిక్స్ తెలిపింది. ముంబై-ఎంఆర్ 20 శాతంతో అగ్రస్థానంలో ఉండగా, 19 శాతంతో బెంగళూరు, ఢిల్లీ-ఎన్సీఆర్ రెండో స్థానంలో సంయుక్తంగా నిలిచాయి. ఈ ఏడాది తమ వేదికపై దేశవ్యాప్తంగా కస్టమర్లు సెర్చ్ చేసిన వివరాల ప్రకారం ఈ మేరకు మ్యాజిక్‌బ్రిక్స్ వెల్లడించింది. ఇదిలావుంటే ఇండ్ల కొనుగోలుకు వీలున్నవారిలో 80 శాతం మంది అపార్ట్‌మెంట్లలోనే ఫ్లాట్లు కొనాలని చూస్తున్నట్టు తేలింది. అలాగే 56 శాతం మంది 3బీహెచ్‌కే, ఆపై ఇండ్ల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారని మ్యాజిక్‌బ్రిక్స్ రిసెర్చ్ అధిపతి అభిషేక్ భద్రా తెలిపారు. ఇక అహ్మదాబాద్, కోల్‌కతాల్లో సరసమైన ధరలకు లభించే గృహాల మార్కెట్ మూడు రెట్లు పెరిగిందని, ముంబై-ఎంఆర్‌లో ఇది 63 శాతం, ఢిల్లీ-ఎన్సీఆర్‌లో 34 శాతం వృద్ధిని కనబర్చినట్టు స్పష్టమైంది. ఇదిలావుంటే భారతీయ రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులను పెట్టేందుకు విదేశీ మదుపరులు జంకుతున్నారు. ఈ ఏడాది మొదలు ఈ నెల 12 దాకా వచ్చిన పెట్టుబడులు 44 శాతం తగ్గడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నది.

ఎల్ఐసీకి మినహాయింపు

- **25 శాతం పబ్లిక్ వాటాకు పదేండ్ల గడువు**

ముంబై, డిసెంబర్ 21: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)లో 25 శాతం కనీస పబ్లిక్ వాటాను పదేండ్లలోపు పెంచుకునే మినహాయింపును కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ సంస్థకు మంజూరు చేసింది. 2022 మే నెలలో ఎల్ఐసీ ఐపీవో ద్వారా ప్రభుత్వం 3.5 శాతం వాటాను (22 కోట్ల షేర్లు) విక్రయించింది. ప్రస్తుతం ప్రభుత్వానికి 96.5 శాతం వాటా ఉంది. వాస్తవానికి సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీలు పబ్లిక్‌కు కనీసం 25 శాతం వాటాను ఆఫ్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కానీ ప్రజా ప్రయోజనాల రీత్యా లిస్టెడ్ ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ నిబంధన నుంచి మినహాయింపు లభించేలా 2021లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఎల్ఐసీకి లిస్టింగ్ తేదీ నుంచి పదేండ్లు (2032 మే వరకూ) కనీస పబ్లిక్ వాటా మినహాయింపును ఇచ్చినట్టు సంస్థ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు తెలిపింది.